క్లుప్తంగా

కౌలు కార్డుల జారీ పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఉష

పీసీపల్లి: మండలంలోని కౌలు రైతుల కార్డుల జారీ త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ ఉష తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ కౌలు రైతు కార్డులు అందజేయాలన్నారు. వ్యవసాయ సిబ్బంది, ఏఈఓ పుల్లయ్య తదితరులున్నారు.

302 మందికి కౌలు కార్డులు

హనుమంతునిపాడు: అర్హులైన ప్రతి ఒక్క రైతుకు కౌలు కార్డులు ఇస్తామని తహసీల్దార్ బి.దిలీప్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు కౌల్ కార్డుల పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 302 కార్డులను ఇచ్చామన్నారు. డీటీ కె.కిషోర్‌రెడ్డి, ఈఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ దిలీప్‌కుమార్

యాజమాన్య పద్ధతులపై అవగాహన


మాట్లాడతున్న సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్

వలేటివారిపాలెం: మండలంలోని పోకూరు రైతు భరోసా కేంద్రంలో మిరప నారు పెంపకం గురించి శిక్షణ కార్యాక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి హేమంత్ భరత్‌కుమార్ అధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త జి. ప్రసాద్ పలు సూచనలు చేశారు. ఏఓ భరత్‌కుమార్ మాట్లాడుతూ మినుము పంటను రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా ధరలో మార్కెట్ చేయొచ్చని తెలిపారు. వెంకటేష్, జ్యోతి, వివేక్, సాంకేతిక వ్యవసాయ అధికారి దుర్గ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికై కృషిచేయాలి


సర్పంచులకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ కల్పన

పొన్నలూరు: మండలంలోని అన్ని పంచాయతీలు వాటి అనుబంధ గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులు కృషి చేయాలని ఎంపీడీఓ కల్పన కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల అభివృద్ధి, చెత్త నుంచి సంపద తయారీ, పారిశుద్ధ్య పనులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసి వాటిని అమలు చేయాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి స్వచ్ఛ గ్రామాలను రూపొందించాలన్నారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కలిగి పంచాయతీలకు ఆదాయం వచ్చే విధంగా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు నిత్యం అభివృద్ధి పనులను పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీల ఆర్థిక వృద్ధే లక్ష్యం


మాట్లాడుతున్న జిల్లా అధికారి రామనాథం

జరుగుమల్లి (సింగరాయకొండ): గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు సక్రమంగా అమలు జరగటంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చేయటమే లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ ఇస్తామనిని ఏపీఎస్ఐఆర్‌డీ పీఆర్ జాయింట్ డైరెక్టర్ రామనాథం అన్నారు. జరుగుమల్లి ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంపై సర్పంచులు, కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాలలో ప్రభుత్వం ఇచ్చే అభివృద్ధి గ్రాంట్‌ను ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలి, చెత్త నుంచి సంపద సృష్టి, పారిశుద్ధ్య, వీధిలైట్లు వంటి సమగ్ర ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీ జలజాక్షి, జిల్లా ట్రెనింగ్ మేనేజర్ అమర్‌నాథ్ బాబు, ఈవోఆర్డీ అంజలీదేవి, ఏఈ రమేష్, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కమిటీల ఎన్నికలు


కనిగిరి: ప్రమాణ స్వీకారంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్


తంగెళ్లలో ఎస్ఎంసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కొమ్ము ఏలియాకు నియామక పత్రం అందజేస్తున్న హెచ్‌ఎం

వెలిగండ్ల: మండలంలోని అన్ని పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహించారు. 58 ప్రాథమిక పాఠశాలలు, 2 ప్రాథమికోన్నత పాఠశాలలు, 5 హైస్కూల్స్, ఒక కస్తూర్బా పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు.

పామూరు: మండలంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసినట్లు మండల విద్యాశాఖాధికారి డీవీ సుబ్బారావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గుత్తి కొండయ్య చైర్మన్‌గా ఎన్నికయ్యారు. సీఐ రామానాయక్, ఎస్సై యం.సైదుబాబు భద్రతా చర్యలు చేపట్టారు.

సీఎస్‌సీఎస్‌పురం (పామూరు): మండల కేంద్రమైన సీఎస్‌పురంతో పాటు మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం నిర్వహించిన పాఠశాల కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డిలు తెలిపారు. మండలంలో మొత్తం 48 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 9 ఉన్నత పాఠశాలల్లో ఈసందర్భంగా నూతన పాఠశాల కమిటీలు ఏర్పడ్డాయన్నారు. ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ భద్రాతా చర్యలు చేపట్టారు.

హనుమంతునిపాడు: మండలంలో 65 పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్, ఉపచైర్మన్ ఎన్నికలను సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించి ఎన్నుకున్నారు. ఎంఈఓ జి.పెద్దిరాజు మాట్లాడుతూ వాలిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో చైర్మన్ ఎన్నిక పదవీ కాలం పూర్తి కాక పోవడంతో ఆ పాఠశాలో ఎన్నిక నిర్వహించలేదన్నారు. హనుమంతునిపాడు ఎస్సై కె.శివనాగరాజు పరిశీలించారు.

కనిగిరి రూరల్: నియోజకవర్గంలోని ఆరుమండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలు గురువారం ముగిశాయి. నియోజకవర్గంలోని 458 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఉపాధ్యాయులు, తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, ఎస్‌కే ఫిరోజ్, తిరుపాలు, రిజ్వాన్, కరీమున్నిసా పాల్గొన్నారు.

సింగరాయకొండ: మండలంలోని 49 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు సజావుగా సాగాయి. మొత్తం 48 పాఠశాలలు ఉండగా 33 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 5 ఉన్నత పాఠశాలల కమిటీల ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆరు ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, ఒక ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయని ఎంఇఓ-2 ఆవుల శ్రీనివాసరావు వివరించారు.

కొండపి(సింగరాయకొండ): మండలంలోని 48 ప్రభుత్వ పాఠశాలల్లో 45 ఎస్ఎంసీల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు మండల విద్యాశాఖ అధికారులు కె.సురేఖ, పి.రామారావు తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ నేతివారిపాలెం, ఎంపీపీఎస్ నేతివారిపాలెం, జనరల్ హెచ్.పి నేతివారిపాలెంలో ఎన్నిక నిర్వహించినట్లు చెప్పారు. అయితే నేతివారిపాలెం ఎంపీపీ ఎస్‌లో కోరం లేక ఎన్నిక వాయిదా వేసినట్లు తెలిపారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని 43 పాఠశాలలకు గాను 42 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించినట్లు ఎంఈఓ బి.నాగేంద్రవదన్ తెలిపారు. ఒక్క పీరాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మాత్రం కోరం లేక ఎన్నిక వాయిదా వేసినట్లు చెప్పారు.

మద్దిపూడి: మండలంలో 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎంఈఓ ఈవీ రంగయ్య తెలిపారు. గార్లపేట, మద్దిపూడి,తంగెళ్ల, కాకర్ల, కూచిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యాకమిటీ చైర్మన్‌లుగా పల్ల వెంకట మురళీబాబు, ఉప్పు సాయిబాబు, కరాటపు నర్సకుమారి, కొమ్ము ఏలియా, చింత గుంట్లచిన సుబ్బారావులు, వైస్ చైర్మన్‌లుగా మానికల లలిత, గురిజాల రోజ్‌మేరి, కమతపు చిన బ్రహ్మయ్య, సీహెచ్ తిరుమల బీ, పంది తిరుపతమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


సీఎస్‌పురంలో సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం


పామూరు: కమిటీకి ఎన్నికైన పత్రం అందిస్తున్న హెచ్‌ఎం


హెచ్‌ఎంపాడులో ప్రమాణ స్వీకారం

25 బస్తాల బియ్యం అందజేత


పేద వృద్ధురాలికి బియ్యం అందిస్తున్న చాంద్ బాషా

పామూరు: మండల కేంద్రమైన పామూరులో పలువురు పేదలకు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ సెంట్రింగ్ చాంద్‌బాషా ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. గురువారం పేద, వృద్ధ, వికలాంగుల ఇళ్లకు వెళ్లి ఒక్కొక్కరికి ఒక బస్తా వంతున 25 మందికి రూ.37,500 విలువైన 25 బస్తాల బియ్యం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద, వృద్ధ, వికలాంగులకు తన వంతు సహాయ సహకారంగా బియ్యం అందజేసినట్లు చాంద్‌బాషా తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు, షేక్ అబ్దుల్ కాలేషా పాల్గొన్నారు.

పరిశుద్ధ నీటితో ఫ్లోరోసిస్ దూరం


ఫ్లోరోసిస్ బాధితులకు సపోర్టు పరికరాలు అందజేస్తున్న దృశ్యం

మద్దిపూడి: ఫ్లోరోసిస్ బారిన పకుండా ఉండాలంటే శుద్ధజలాలు సేవించాలని ఎన్‌పీపీసీఎఫ్ జిల్లా కన్సెల్టెంట్ వీ అనిల్ అన్నారు. మండలంలోని పన్నూరు గ్రామంలో గురువారం జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఫ్లోరోసిస్ బాధితులకు ఉచితంగా సపోర్టు పరికరాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రౌండ్ వాటర్‌లో 1పీపీఎం ఉంటే ఫ్లోరోసిస్ ఉన్నట్లు గుర్తించాలన్నారు. ఈ కారణంగానే పళ్లు గారపట్టడం, ఎముకల్లో పటిష్టత కోల్పోవడం లాంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. నివారణకు విటమిన్ సి ఉండే ఉసెర, నిమ్మలాంటి సిట్రస్ ఉండే పండ్లు తినాలన్నారు. ఆకుకూరలు, పాలు,గుడ్లు తీసుకోవడం వల్లా ఫ్లోరోసిస్ బారిన పడకుండా ఉంటామన్నారు. కాకర్ల వైద్యాధికారిణి సాయి రిస్తా మాట్లాడుతూ విటమిన్ సీ ఉండే జామ, నారింజ, దానిమ్మలాంటి పండు ఎక్కువగా తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పల్స్ సర్వే పగడ్బందీగా నిర్వహించండి

వెలిగండ్ల: జలజీవన్ మిషన్ కార్యక్రమంపై పల్స్ సర్వేకు ప్రభుత్వం ఆదేశించిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 9 నుంచి 14 వ తేదీ వరకు పల్స్ సర్వే చేపట్టాలన్నారు. స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ ఎ. కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కనిగిరిలో శునకాల బీభత్సం



కనిగిరి పట్టణంలో కుక్కల స్వైర విహారం

- బెంబేలెత్తున్న జనం
- కోళ్లను, మేకలను వదలని కుక్కలు

కనిగిరి రూరల్: పట్టణంలో భైరవులు భీకరం సృష్టిస్తున్నాయి. ప్రతి రోజూ ఏదో ఒక వీధిలో మనుషులను, మూగజీవాలు (కోళ్లు, మేకల)పై దాడులు చేసి గాయ పరుస్తూ.. భయాందోళనలకు గురి చేస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు మౌన వ్రతం పాటిస్తున్నారు. కుక్కల బారిన పడి అనేక మంది గాయాల పాలవుతున్నారని, కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు కేకలు పెట్టినా.. సోషల్ మీడియా వేదికగా గగ్గోలు పెడుతున్నా మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

వీధి కుక్కల స్వైర విహారం..

మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా పదుల సంఖ్యలో కుక్కల సమూహం దాడి చేసి వృద్ధులను, చిన్నారులను గాయపరుస్తున్నాయి. 10, 9, 3, 4 వార్డుల్లో కోళ్లపై దాడి చేసి పీకలు కొరికి చంపగా.. మేకలు, గొర్రెలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి చంపాయి. పట్టణంలోని నిత్యం ఏదోక చోట కుక్కల దాడి జరుగుతూనే ఉంది. ప్రధానంగా పాతూరు. 13,9, 11, 17, 3,4,5,6, వార్డుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. పట్టణంలో కొన్ని వీధుల్లో ఆటోల్లో, దిచక్ర వాహనాల్లో వెళ్తున్నారు. అయినా బైక్‌లను కుక్కలు వెంబడించి మరీ దాడి చేస్తున్నాయి. ఇక కాలినడక వీధుల్లో రాత్రి వేళ వచ్చే వారి బాధలు వర్ణనాతీతం. దీంతో పట్టణ ప్రజలు కుక్కల ధాటికి బెంబేలెత్తుతున్నారు.

రెండు వారాల్లో 47 మందికి కుక్క కాట్లు

కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో గత నెల 26 నుంచి ఈనెల 8 వరకు మొత్తం 47 మంది కుక్క కాట్ల గురై చికిత్సలు చేయించుకున్నట్లు నివేదికలున్నాయి. అందులో కనిగిరి పట్టణం, మండలంలో 34 మంది కుక్క కాట్లకు గురి కాగా, మర్రిపూడికి చెందిన 2, హెచ్‌ఎంపాడులో 8 మంది, సీఎస్‌పురం నుంచి 3 కుక్క కాట్లకు గురయ్యారు. గడిచిన వారం రోజుల్లో 31 మంది కుక్క కాట్లకు గురయ్యారు. తాజాగా బుధవారం మున్సిపల్ కార్మికుడు ఒకరు కుక్క కాటుకు గురైనట్లు తెలిసింది.

విద్యార్థుల తల్లి దండ్రుల్లో ఆందోళన

ప్రధానంగా కుక్కల ధాటికి విద్యార్థుల తల్లి దండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విద్యార్థుల పిక్కలు వదలకుండా పీకుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని చింతల పాలెం, శంఖవరం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల వద్ద కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. దీంతో పాఠశాలలు వదిలిన తర్వాత టీచర్లు బయటకు వచ్చి కుక్కలను తరిమి ఆతర్వాత విద్యార్థులను పంపుతున్నారు. పట్టణంలోని కొత్తపేట, గార్లపేట రోడ్డుల్లోని స్కూల్స్, కాలేజీల కూడళ్లలో కుక్కలు, రాత్రి పగలు తేడా లేకుండా దాడి చేస్తున్నారు. రాత్రి వేళ స్టడీ అవర్స్‌కు వెళ్లి వచ్చేందుకు జంకుతున్నారు. పాఠశాల వీధులు దాటే దాక విద్యార్థులంతా కలిసి ప్రయాణం చేసి, ప్రధాన సెంటర్‌కు చేరి ఊపిరి పీల్చుకుంటున్నారు. ప్రతి రోజూ కొందరు విద్యార్థుల తల్లి దండ్రులు వారి పిల్లలను తీసుకుని వెళ్లేందుకు కుక్కల భయంతో స్కూల్ స్టడీస్ వదిలేంత వరకు ఉంటున్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల వద్ద కుక్కలు హల్ చల్ చేస్తున్నాయి. దీనికి తోడు వీధుల్లో సరిగా వీధి దీపాలు వెలగక పోవడంతో పట్టణ ప్రజలు రాత్రి వేళ్ల పడే అవస్థలు వర్ణణాతీతం.

నామ మాత్రపు చర్యలు ...

కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు అనేక మంది మున్సిపల్ సమావేశంలో గగ్గోలు పెట్టారు. ప్రజలు మున్సిపల్ అధికారులకు విన్నపాలు చేశారు. సుమారు ఏడాదిన్నర క్రితం కుక్కలను పట్టేందుకు నక్కల వారిని (ప్రత్యేక సిబ్బందిని) పిలిపించి కొన్ని కుక్కలను పట్టించి మమ అని పించారు. కుక్కల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కార్యక్రమం ద్వారా కుక్కలకు స్టెరిలైజేషన్ ఆపరేషన్లు చేయించి సంతతి పెరగకుండా నియంత్రించ వచ్చు. అయితే మున్సిపల్ అధికారులు అటువంటి ప్రయత్నమే చేయక పోవడం దురదృష్టకరం. ఈ విధానంలో మున్సిపాలిటీ ఒక్కో కుక్కకు రూ. 800 వరకు చెల్లించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీలో లక్షల రూపాయలు జనరల్ ఫండ్‌ను రక రకాల పేరితో సుమారు మూడు నెలల్లో రూ 12 లక్షలకు పైగా ఖర్చు పెట్టారు. కానీ కనీసం ప్రజా సంక్షేమం కోసం ఖర్చుపెట్టక పోవడం.. కనీసం ఆ వైపుగా దృష్టి పెట్టక పోవడం పై ప్రజలు మున్సిల్ అధికారు తీరుపై దుమ్మెత్తి పోస్తున్నారు.


కుక్క కాటుకు గాయి పడిన వృద్ధుడు (ఫైల్)

నూతన వధూవరులకు ఆశీర్వాదాలు


వధువు శిరీషాను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

మద్దిపూడి: మండలంలోని చిలంకూరు గ్రామంలో సచివాలయం కన్వీనర్ దాసరి తిరుపతిస్వామి సోదరి శిరీషా వివాహనికి మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వధువు శిరీషా, వరుడు మాధవరావులను ఆశీర్వదించించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యులు మాకినేని సుధారాణి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ మాజీ మండల పార్టీ బోద రమణారెడ్డి, మాచేపల్లి నాగయ్య, మాకినేని రమణయ్య, బోగసముద్రం విజయభాస్కర్ రెడ్డి, వీరెళ్ల చెన్నపనాయుడు, తానికొండ రమేష్, వీరేళ్ల బ్రహ్మయ్య, వీరేళ్ల శ్రీను, పులిచెర్ల రామిరెడ్డి, అలికేపల్లి కోటేశ్వరరావులు ఉన్నారు.

సమాన విద్యతోనే సమానత్వం

టంగుటూరు: రాజ్యాంగం కోరుకున్న సమానత్వం సమాన విద్యతోనే అందుతుందని ఎంఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మక్కెన థామస్ పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వెంకటాయపాలెం ఎస్టీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 25 మందికి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 600 మందికి పైగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశామని థామస్ తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కచ్చితంగా చదివించాలని కోరారు. ఉపాధ్యాయుడు కె.వి. రామారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మూవీ అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్, స్థానిక గిరిజన యువత ప్రతినిధి రావూరి శ్రీహరి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి

టంగుటూరు: అన్ని గ్రామాల్లో గ్రామీణ ఉపాధి పథకం పనులు ప్రారంభించాలని అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం టంగుటూరు, సింగరాయకొండ ఉపాధి హామీ సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల తోట పెంపకానికి సంబంధించి రైతులకు అవగాహన కల్పించారు. లబ్ధిదారులను ఎంపిక చేసి అంచనాలు తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. అన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు వెంటనే పనులు ప్రారంభించి కూలీలకు ఉపాధి కల్పించాలని ఆయా గ్రామాలకు ఇచ్చిన టార్గెట్లు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఏపీఓ సుభాషిణి, ఈసీ దివి కుమార్, సింగరాయకొండ టంగుటూరు మండలాల టీఏలు, ఎఫ్ఏలు, బీఆర్టీలు పాల్గొన్నారు .

కోరమాండల్ ఆర్వో ప్లాంట్ ఏర్పాటు


ఆర్వో ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర, వైస్ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారెడ్డి

కనిగిరి రూరల్: మండలంలోని కంచర్లవారి పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కోరమండల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారెడ్డి, ఆర్‌బీహెచ్ చక్రవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎస్ఆర్ కంపెనీ ఆధ్వర్యంలో 99 ఆర్వో ప్లాంట్‌లను ఇచ్చినట్లు.. 18000 గర్ల్ చైల్డ్‌లకు స్కాలర్ షిప్‌లు అందించినట్లు వివరించారు. జెడ్ఎం హరి, సీనియర్ అగ్రోనమిస్టు తిరుపతిరావు, హెచ్ఎం విజయభాస్కర్, దేవిరెడ్డి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబా ప్రత్యేక పూజలు నేడు


బాబా గుడిలో అమ్మవారికి విశేష పూజలు

కనిగిరి రూరల్: స్థానిక షిరిడి సాయిబాబా దేవస్థానంలో శ్రావణ మాస శుక్రవారం పురస్కరించుకుని శుక్రవారం పూజ కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా ప్రతి శుక్రవారం శ్రీలక్ష్మీ అమ్మవారికి ఉదయం 6గంటలకు లక్ష్మీ పూజ, కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. 26న శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా విశేష పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ వారు తెలిపారు.